వేసినది సైడు హీరో వేషాలే అయినా, పది తెలుగు సినిమాలు చూసిన వాడికైనా నన్ను సినిమా యాక్టరుగా గుర్తుపట్టడం ఏమంత కష్టతరమైన పనేం కాదు. అందులో నాకు సిగ్గు అక్కర్లేకుండానే యిప్పటి వరకూ నటింప చేసారు కూడా దర్శకులు. అలాంటిది ఆ వూళ్ళో మా రవిగాడు చెప్పేదాకా ఒక్కళ్ళూ నన్ను సినిమా నటుడిగా గుర్తించలేక పోయేసరికి నేను విపరీతంగా నిరుత్సాహ పడిపోయాను. అయినా నన్ను గుర్తించడం ఆ సందర్భంలో అంతగా ప్రధానమైనది

# వెండితెర

## తులసి బాలకృష్ణ

కాదు కాబట్టి నాకు నేనే సర్ది చెప్పుకున్నాను.

ముదురు తాటాకులు దట్టంగా అల్లిన పందిరి చల్లటి నీడలో, కొబ్బరి ఆకులు వింజామరలై వీస్తున్న హాయి అయిన గాలిలో, పచ్చి మామిడి ఆకుల అందమైన తోరణాల కమ్మని సువాసనలో, ఆహ్వానితుల ఛలోక్తులలో, ఆడవాళ్ళ పట్టు చీరెల రెపరెపలతో, బాజా భజంత్రీల మోతలలో, పురోహితులు ఉచ్ఛైస్స్వరంతో చెబుతున్న మంత్రాలతో రవి చెల్లెలు సుందరి పెళ్ళి ధూమ్మని జరిగిపోతోంది.

కన్యాదాత సుఖం వధూవరులను మించి కళకళలాడడం గతంలో నేను చాలా పెళ్ళిళ్ళలోనే చూసాను. రవిగాడి మొహం సూర్యబింబంలా వెలిగిపోతోంది. తల్లి, తండ్రి లేని చెల్లాయి పెళ్ళి ఆమెకిష్టమైన వ్యక్తితో చేస్తున్నందుకు వాడి ఆనందానికి పట్టపగ్గాలు లేవు.

ప్రొద్దున్న తొమ్మిది గంటల పదకొండు నిముషాలకు సుముహూర్తం. ఈ లోగా ఆహ్వానితులందరికీ ఒక కోటా ఉప్మా కాఫీ లయ్యాయి నాకయితే స్పెషల్ ఉప్మా, కాఫీ అందాయి. కారణం నేను రవిగాడి ప్రాణస్నేహితుడినవడం మాత్రం కాదు. దానికో కిటుకు వుంది. నా చిన్నప్పట్నుంచీ కూడా బాగా తెలిసున్న వాళ్ళ పెళ్ళికి వెళ్ళినా వంటల దగ్గర చేరటం నాకు అలవాటు. అలాగే యిక్కడ కూడా వంటల దగ్గర చేరాను. నర్తనశాలలో భీముడి లాంటి వ్యక్తొకాయన చీఫ్ కుక్. అతగాడ్ని కబుర్లలో దింపాను. నేను సినిమా నటుడినని విని మహంత యిష్టం చూపించాడతను. తనకి కొద్దిగా నాటకానుభవం వుందని, ఎప్పట్నుంచో సినిమాల్లో భీముడి వేషం వేయాలని వుందని ఎవ్వరూ వినకుండా

సామ్ముందు గుమ్మరించాడు తన మనసుని

"ఓ, దానికేముంది మళ్ళీ మావాళ్ళు నర్తనశాల తీసే ప్రయత్నంలో వున్నారు ఎవర్ గ్రీన్ సబ్జక్ట్ కదా అది అందులో వలలుడి వేషం నీదే" అన్నాను హామీ యిస్తూన్న ధోరణిలో నమ్మకంగా.

ఆనందంతో కన్నీళ్లు తిరిగాయి అతని ఉత్సాహంలో నుంచి వు[illegible]లుగా బయటకు రాగా, ఆపుకోలేక బిగ్గరగా భీముడి ఫక్కీలో ఓ నవ్వు నవ్వేసాడు కూడా ఆ పైన జీడి పప్పులు, నెయ్యి ఘుమ్మగా [illegible]ప్పించిన వేడి వుప్మా, సోలగ్లాసుతో స్పెషల్ కాఫీ స్వయంగా అందించాడు. నిజంగా ఆ రుచులు మరిగితే కీచకుడు సైరంధ్రిని తప్పక మరచి పోతాడు. ఆవిధంగానైనా నా పూర్తి బ్రతుకు బ్రతికి వుడ్‌వేవాడ-ఫూర్ ఫేలో మనసులోనే చీఫ్ కుక్‌కి థాంక్స్ చెప్పి, పందిట్లోకి చేరాను.

పందిరి పకపక లాడుతోంది.

ఒక ప్రక్కగా పందిరి రాటకు జేర్లబడి పెళ్ళి తంతు గమనిస్తున్నాను.

సుందరని పరికించి చూడటం అదే మొదటి సారి నాకు.

పెళ్ళికూతురు అలంకరణలో సుందరి రంభని "పెనాల్టీ కిక్" యిచ్చినంత అందంగా వెలిగి పోతోంది చెప్పొద్దూ—నా కళ్లు చెదిరిపోయాయి. మనసు వశం తప్పింది. ఒళ్లు తేలికయిపోతోంది... ....

మంగళ వాయిద్యాలు మ్రోగుతున్నాయి, హృదయాలు డోలలూగేలా.

పోటీలుపడి మంత్రాలు చదువుతున్నారు యిరుపక్షాల పురోహితులు.

బంగారపు తాళిని ఆప్యాయంగా చూస్తూ, అపురూపంగా పట్టుకుని, వధువు కంఠసీమని అలంకరింపజేసి, పసుపుత్రాటిని మూడుముళ్లు వేస్తున్నాడు వరుడు.

"ఆగు!!!"

అదిరిపడ్డారు వధూవరులు.

అంతకు మించి కన్యాదాత.

వారితోబాటే ఆహూతులు.

"ఈ పెళ్ళి జరగటానికి వీల్లేదు"—వరుడి తండ్రి.

తెల్లబోయేరంతా.

"ఆ మంగళ సూత్రం కట్టకు. అక్కడ్నుంచి కదలిరా. ఈవిడగారు యింతకు ముందే ఎవడితోనో ప్రేమ వ్యవహారం సాగించిందట చాలా దూరమే సాగిందిట గ్రంధం. ఇప్పుడే మన శ్రేయోభిలాషి ఒకాయన చెప్పాడు నాకీ విషయం. ముచ్చట్లన్నీ తీరాక మూడుముళ్ళ కోసం నువ్వు కావలసి వచ్చావు కాబోల. ఛీఛీ.... రారా బయటకు."

పరుగున పోయి ఆయన కాళ్ళను చుట్టేసుకున్నాడు రవి.

"అయ్యా, నా చెల్లెలు ఏ పాపం ఎరుగదు. ఆమెకు ఎవ్వరితోనూ గతంలో సంబంధంలేదు. కిట్టని వాళ్ళెవరో మీతో అబద్ధం చెప్పి, పీటలమీద పెళ్ళి చెడగొడుతున్నారు. నామాట నమ్మండి."

"పోవోవయ్యా. చెప్పొచ్చావు. గాలి కబుర్లు నమ్మడానికి నేనేం బొడ్డూడని వాణ్ణికాదు. పదరా. యింకా చూస్తావేం?...."

—కదలిపోయేరు వరుడి తరుపువాళ్లు వరుడితో సహా.

ఆహూతు లందరూ క్షణంలో "హుష్ కాకీ" అయిపోయేరు.

కుప్పకూలి పోయాడు రవి

శిలా ప్రతిమలా కూర్చున్న చోటనే చేష్టలుడిగి కూర్చుండి పోయింది సుందరి.

నెమ్మదిగా ముందుకు అడుగులు వేసాను నేను. రవి చుబుకాన్ని పట్టుకుని పైకెత్తి చిరునవ్వు నవ్వాను. వడివడిగా నడచి, పెళ్ళి పీటల మీదకు వెళ్ళి సుందరి మెళ్లో తాళి కట్టాను. హృదయం వువ్వెత్తున లేచిన సముద్ర తరంగమై పోగా నా గుండెలమీద వాలిపోయింది సుందరి. పరుగున వచ్చి నా కాళ్ళను చుట్టేసుకున్నాడు రవి......

.."ఒరేయ్' ఏమిటి నీ పరధ్యాన్నం?.... ఏ హీరోయిన్ గురించి ఆలోచన? పెళ్ళవు



టుం నే భోజనాలు వడ్డించెయ్యాలి. ఆ సెకన్ ‘వచ్చాయో కనుక్కో.”
నీకే అప్పగించాను. వంట లెక్కడిదాకా —ఉలిక్కిపడి, బ జంమీద పడ్డ చే .

దానికి సంబంధించిన మనిషిని చూసాను.

రవి.

హడావుడిగా చెప్పేసి, మరోవైపు పరుగెట్టాను.

గబుక్కున వేదికవైపు చూసాను.

నును సిగ్గు దొంతరలలో వధువు సుందరి.

ప్రక్కన రీవిగా వరుడు.

చాలా సిగ్గుపడిపోయేను.

నా ఛండాలపు ఆలోచనకు నాకే చచ్చేంత అసహ్యం కలిగింది.

సినిమా మనిషిని కావడంతో అన్నీ ఇటువంటి పుచ్చు సినిమా ఆలోచన్లే....

శుభమా అంటూ వివాహం జరుగుతూంటే, అది చెడిపోవాలని, నేను ఆమె మెళ్లో తాళి కట్టి, హీరో ననిపించుకోవాలని కలగన్నానే గాని సినిమాల్లోలాగ నిజ జీవితంలో జరుగుతుందా? అయినా శుభ కార్యం సజావుగా సాగాలని కోరుకోవాలి గాని, అందంగా కనిపించిందని స్నేహితుడి చెల్లెల్ని పెళ్ళిపీటలమీదుండగా భార్య కావాలని కోరుకోవడం-ఎంత దారుణం?

అంత అందమైన పిల్ల నాకు దక్కాలనే స్వార్థం, అటువంటి పిల్లకు అన్యాయం జరిగితే ఆదుకోవాలనే త్యాగగుణం, రెండూ వున్నాయేమో నా వూహలో.

వడివడిగా నడుచుకుంటూ, వంటశాల వైపుకు వెళ్లాను.

వలలుడిగారి ఆధ్వర్యంలో వంటలు శర వేగంతో సాగుతూన్నాయి. నా నిశ్వాసపుటాలు పూరించి గుండెలనిండా ఆ కమ్మని వాసనలని పీల్చుకున్నాను.

పందిట్లో మంగళ వాయిద్యాలు ఒక్కసారిగా మిన్ను ముట్టాయి.

"మాంగల్య ధారణ" అన్నారెవరో ఉత్సాహంగా.

చేతిలో పని ఆపు చేసి, పందిట్లోకి లేడి పిల్లలా పరుగెత్తింది ఓ ఆడ వంటమనిషి, "చూడాలి" అంటూ.

"హార్నీ .... మిస్ అయిపోయానే" అనుకుంటూ నేనూ పరుగెత్తాను.

నేను వేదిక చేరడం, అందరూ కోలాహలంగా ఉవ్వెత్తున లేవడం ఒకేసారి జరిగిపోయాయి. ఏదో గడబిడ గోల, అరుపులు కంగారుగా.

మనసు ఆందోళన చెందుతుండగా అందర్నీ తప్పించుకుంటూ మధ్యకు చేరాను.

"చాల్లేవయ్యా పెద్ద మనిషీ తాహతు లేక పోతే అంతస్థుకి తగ్గవాణ్ణే కోరుకోవాలి. ఏ ధైర్యంతో ముహూర్తం సమయానికి సొమ్మంతా పువ్వుల్లో పెట్టి అప్పజెప్తానని మాటిచ్చావు? మేం అంత చేతకాని దద్దమ్మలం అనుకున్నావేమిటి?"— రంకెలేస్తున్నాడు పెళ్ళికొడుకు తండ్రి.

కన్నీళ్ళతో తలవంచుకుని నిల్చున్నాడు రవి.

"నీ చెల్లెలి యింతోటి అందానికి ముగ్ధుపోయి, మా వాడు తండ్రిని ధిక్కరించి తాళి కట్టేస్తాడులే అనుకున్నావా? లేక నీ దొంగ ఏడుపుతో ఆ కట్టుకుందాం అనుకున్నావా? ఇలాంటి పిచ్చి పిచ్చి వేషాలు యింకెవరి దగ్గరా వెయ్యకు." అని ఆయన పెళ్ళికొడుకువైపు చూడగానే అతగాడు కిమ్మనకుండా బయటకు నడుచుకొచ్చాడు.

"ఛీ ఛీ" అంటూ అందరూ బయటకు నడిచారు.

మొదలు నరికిన చెట్టులా విరుచుకు పడిపోయాడు రవి.

భూమిలోకి తొక్కబడుతూన్న బలి చక్రవర్తిలా, తలని పాదాల మీదకు వంచుకుని చలన రహితంగా కూర్చుని వుంది సుందరి.

ఇదీ కలేనా? లేక నిజమా?


అంతా అయోమయం.

చేతిమీద గిల్లుకుని చూసుకున్నాను.

నిజమే!

కల కాదు.

పాడు ఆలోచన, అలా జరగదు, జర



కూడదు అనుకున్నానే ఎలా జరిగింది?!!

ఇస్తానన్న కట్నం సమయానికి ఇవ్వక పోవడం వలన చెడిపోయిందన్న మాట పెళ్ళి.

ఉక్కిరి బిక్కిరిగా వున్నట్లుగా వుంది నాకు

చుట్టూ చూసాను. జన సందోహంతో కిలకిల కిటకిట లాడిన ప్రదేశం క్షణాల్లో భయంకర నిశ్శబ్దాన్ని సంతరించుకుని స్మశాన వాటికలా వుంది.

ఇప్పుడు నేనేం చెయ్యాలి?!

వాట్ టు డు?!

రవికి ధైర్యం చెప్పి, పీటల మీదకు వెళ్ళి, సుందరి మెళ్లో తాళి,... ...

యస్....ఐషుడ్ ....

అం....నోనో....ఇదేం చవట పని . ఐషుడ్ నాట్....ఇంత డబ్బు, పేరు గడించుకుని,....అంత మంది అమ్మాయిలు నాకోసం పడి చస్తూంటేగా....అయినా....అలా చేస్తే బంగారు మామయ్య గతేంకాను... తన కూతుర్ని నాకివ్వడం కోసం, తలలు పగల కొట్టి, కొంపలు కూల్చి. ఆయన కూడ బెడ్తున్న డబ్బంతా గంగపాలే కదా. అందులో సినిమా ఛాన్సులు పెరిగేకొద్దీ నా "డిమాండూ" పెరుగుతోందే. అయినా సినిమాల్లో యిటువంటి పనులు చేసినవాణ్ని హీరో అంటారు కానీ, నిజజీవితంలో అయితే "వెర్రి వెంగళాయి" అంటారు.

కానీ సుందరి అప్సరసే....రవి ప్రాణ స్నేహితుడే ...

ఛఛ ... ఈ ఆలోచనలే మెదడులోకి రానివ్వకూడదు . ఇవన్నీ సినిమాల్లోనే.... ముఖానికి రంగు పులుముకున్నప్పుడే నీతులు వల్లించాలి .. ఇప్పుడు నాకేం ఖర్మ....

—రవి వైపు అడుగులు వేసి, వాడిముఖాన్ని పైకి ఎత్తి, అతి విచారాన్ని అద్వితీయంగా నటిస్తూ, "బి బ్రేవ్ ఫ్రెండ్" అని భుజంతట్టి నాగది వైపు గబగబా నడిచి, బాగ్ తీసుకుని, బయటకొచ్చి, ఆటోలో దూరి. "రైల్వే స్టేషన్‌కి పోనియ్యి త్వరగా" అన్నాను.